క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

బోథ్: బోథ్, సొనాల మండలాల ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ బూస లక్ష్మణ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జూకంటి సదాశివ్, ప్రధాన కార్యదర్శిగా ముప్కాల రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా దండారి రంజిత్, కోశాధికారిగా కాడెరుగుల గణేశ్, సలహాదారులు కాడెరుగుల రోహిత్, జింక దేవేందర్, పిసారా నితీష్ గౌడ్‌లను ఎన్నుకున్నారు.

ఉగాది ఉత్సవానికి తరలిరండి

ఆదిలాబాద్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్న ఉగాది ఉత్సవానికి తరలిరావాలని నగర సంఘ చాలక్ నూతుల కల్యాణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సుబ్రహ్మణ్య సుధాకర శర్మ రానున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా వక్తగా శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ హాజరవుతారన్నారు.

ముస్లిం కుటుంబాలకు సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని షాదీఖాన, భుక్తాపూర్, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, సుభాష్‌నగర్, బంగారిగూడ కాలనీల్లోని 600 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట అజీజ్, షఫీ, ఆశన్న యాదవ్, మోరేష్, జహీర్, సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ సద్గురు పూలాజీ బాబా సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని ఆద్మీయాన్ గ్రామంలో పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 16వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన కేంద్రంలో ప్రత్యేకంగా మహా పూజ చేశారు. ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, యువత సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత హిందూ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్, భక్తులు పాల్గొన్నారు.

స్వీట్లు తినిపించి.. పనులు చేయించి

బోథ్: బోథ్ మండలంలోని బాబెర గ్రామంలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రమేశ్ శనివారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలో వ్యవసాయ నీటికుంట పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పనులను మెచ్చుకున్నారు. సంతృప్తి వ్యక్తం చేసి, కూలీలకు స్వీట్లు తినిపించారు.

ఎమ్మెల్యే హరీశ్‌బాబు దిష్టిబొమ్మ దహనం

తాంసి: భీంపూర్ మండలంలోని శాంతినగర్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు దిష్టిబొమ్మను కొలాం గిరిజనులు శనివారం దహనం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడిన తీరుకు నిరసన చేపట్టారు. కొలాం సంఘం రాష్ట్ర నాయకుడు టేకం దిలీప్ మాట్లాడుతూ మన్నేవార్‌లను పీవీటీజీలుగా గుర్తించాలని అనడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను కొలాం గిరిజనుల తరపున ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొలాం నాయకులు అనిల్, రాజు, సిడాం దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం రక్షణ కవచం

ఇచ్చోడ: రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం అని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాజ్యాంగం అందించిన హక్కులను సమానత్వాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తూ.. దాని పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, పసుల చంటి, నరేశ్ జాదవ్, క్లెం నారాయణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓం శ్రీ శనీశ్వరాయ నమః

ఆదిలాబాద్: శని అమావాస్యను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ శనీశ్వర ఆలయానికి భక్తులు బారులు తీరారు. శనీశ్వరుడిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆలయంలో భక్తులు నల్లని నువ్వులు, వస్త్రాలు సమర్పించి తైలాభిషేకం నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు



ఆలయం వద్ద బారులు తీరిన భక్తజనం

సిరిచెల్మలో భక్తుల సందడి

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శనివారం అమవాస్య కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయం పక్కనే ఉన్న చెరువులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ఆవరణలోని శని విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్ రెడ్డి

తాంసి: ప్రతిఒకరూ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వడ్డాడి పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు, రైతులకు నీటి ఎద్దడి నివారణపై అవగాహన కల్పించారు. మురికినీటితో పాటు, వృథా నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి వెళ్లేలా చూడాలన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణం కోసం ఉపాధిహామీ పథకం ద్వారా డబ్బులను అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏవో రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను కాపాడుకోవాలి



తానికాయలను అందచేస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: విలువైన అటవీ సంపదను కాపాడుకోవాలని అటవీశాఖ అధికారులు పుండలిక్, నాగవత్ స్వామిలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు అటవీ ప్రాంతంలో అరుదుగా దొరికే తానికాయలను సేకరించి శనివారం అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవిలో అరుదుగా దొరికే తానికాయల్లో విలువైన ఔషధ గుణాలు ఉన్నాయన్నారు. అటవీ సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, అధ్యాపకులు కటకం మురళి, అనిత, నర్సయ్య, సరితరాణి, మధు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో సునీల్ పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఉన్నతస్థాయికి చేరాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసి నృత్యం, నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఉపాధ్యాయులు విజయ్, ప్రవళిక, కల్యాణి, మానస, పోషకులు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు

నేరడిగొండ: వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేష్ హెచ్చరించారు. శనివారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. మండలంలోని రోల్‌మామడ, టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం హైవే మీద లారీలు ఆపుతున్నారని సమాచారం రాగా నేరడిగొండ పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా, ఎలాంటి ఆధారం లేకుండా మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ వెళ్తున్న పశువుల వాహనాలను అక్రమంగా కొందరు యువకులు అడ్డుకొని డ్రైవర్లు జావిద్ ఖాన్, జుబేర్ ఖాన్‌లను బెదిరించడం జరిగిందన్నారు. లారీలో ఎద్దులు కావు, ఆవులు ఉన్నాయని, లారీల్లో ఎక్కిచూస్తూ లారీ డ్రైవర్లను కొట్టడానికి వెళ్తూ భయభ్రాంతులకు గురి చేశారని, భయభ్రాంతులకు పాల్పడిన వారిపై శనివారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి వాహనాలను, ప్రజలను ఇబ్బంది చేస్తే చర్యలు తప్పవన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పర్ధాన్ సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి: గొండి ధర్మగురు హీరాసుక జెండాను ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం పర్ధాన్ సమాజ్ పెద్దలు డిమాండ్ చేశారు. మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో గొండి ధర్మగురు హీరాసుక స్మారకంగా ఏర్పాటు చేసిన జెండాను తొలగించడం, ధ్వంసం చేయడంతో పర్ధాన్‌గూడ హీరాసుక స్మారక జెండ వద్ద నిరసన తెలిపారు. అనంతరం పంచామృతలతో హీరాసుక చిత్రపటాన్ని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో పర్ధాన్ సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్వ నగేశ్, గేడం భారత్, గ్రామపటేల్ గేడం జ్ఞానేశ్వర్, సోయం మురహారి, ఆత్రం అనుసూయ, కుంర వందన పాల్గొన్నారు.

మహాబోధి విహార్‌ను విముక్తి చేయాలి

నార్నూర్: బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో ఉన్న మహాబోధి విహార్‌ను విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న నిరసనలో మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన మహార్ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు దుర్గే రుక్మాబాయి ఆధ్వర్యంలో శనివారం మహిళలు పాల్గొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో బుద్ధుడు తపస్సు చేసిన పవిత్ర స్థలం మహాబోధి ఉందన్నారు. కానీ ప్రభుత్వంతో కలిసి పవిత్ర స్థలాన్ని కబ్జా చేయడంతో వాటి విముక్తి కోసం మహాబోధి మహా విహార ముక్తి ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పే సోంబాయి, మీనాబాయి, శీలాబాయి, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావు మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కులాల బేధాలు లేకుండా వివాదాలకు పోకుండా కలిసి మెలిసి ఉండాలన్నారు. అట్రాసిటీ కేసుల నమోదు, తదుపరి పరిణామాలు, పౌర హక్కులపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై లింగన్న, పంచాయతీ కార్యదర్శి నితిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జామ మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వమతాల సా రం ఒకటేనని ప్రతిఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో కయ్యూం, కరీం, కలీం మౌలానా, ముంతాజ్, జుబేర్, నిసార్, అన్సార్, ఫహీం పాల్గొన్నారు.

విపత్తు సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

ఆదిలాబాద్(జైనథ్): వరదల వంటి విపత్కర సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంసీహెచ్‌ఆర్‌డీ మేనేజర్ ప్రభాకర్, భోరజ్ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో శనివారం విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం జాతీయ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైనథ్ ఎస్సై పురుషోత్తం, వీడీసీ చైర్మన్ అల్లూరి భూమారెడ్డి, స్వామి, మహేందర్, సూరజ్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

బోథ్: బోథ్ మండల కేంద్రంలో లైబ్రరీ, ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. బోథ్ నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో అల్లకొండ పోతన్న, సాయినాథ్‌గౌడ్, రాయిపెల్లి రమాకాంత్, సయ్యద్ యాసిన్, మెడిచేల్మ ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన మాల కిరణ్ కుమార్ మంజూరైన రూ. 57,000ల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని దంషాతండా గ్రామస్తులు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

అందరికీ ఆదిలాబాద్‌లో అన్నదానం

నేరడిగొండ: ఏప్రిల్ 1న ఆదిలాబాద్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. శనివారం ధర్మప్రచార బృందం సభ్యులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. ఆదిలాబాద్‌లో దీక్షాభూమి కొత్తపల్లి నుంచి బంజారా కాశీపొరదేవి మహారాష్ట్ర వరకు సేవలాల్ దళ్ పాదయాత్ర ఈనెల 31న ప్రారంభం కానున్న నేపథ్యంలో పాల్గొంటున్న సేవలాల్ దీక్షాపరులకు ఏప్రిల్ 1న ఆదిలాబాద్‌లో అన్నదానం చేయాలని కోరిన ధర్మప్రచార్ బృందం కోరిక మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ఇచ్చోడ: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆకాంక్షించారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వారికి ఫలాలను తినిపించి ఉపవాసదీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో సాజిదుద్దీన్, సలీం పాషా, అజయ్, ఆశ్రాఫ్, నజీర్ హైమద్, ఇజ్జగిరి నారాయణ, మనోహర్, అత్తరుల్లా పాల్గొన్నారు.

'రాజ్యస్థాపన కోసమే రథయాత్ర'

నేరడిగొండ: తెలంగాణ రాజ్యస్థాపన కోసమే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర నిర్వహించనున్నట్లు ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రథయాత కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 14న మా భూమి రథయాత్ర ప్రారంభ సభతో మొదలై తెలంగాణలో ఉన్న 33 జిల్లాలు, 612 మండలాలు, దా. 12 వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతున్నారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, సంతోష్, ఖదీర్, భూమన్న, ప్రవీణ్, అడెల్లు పాల్గొన్నారు.

నేడు ఉగాది పచ్చడి పంపిణీ

ఆదిలాబాద్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఉగాది పచ్చడి గుడాల పంపిణీ నిర్వహించనున్నట్లు మఠాధిపతి శ్రీ శ్రీ యోగానంద సరస్వతి స్వామి తెలిపారు. శుక్రవారం మఠంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సమితి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు కార్యక్రమంప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి గేడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, బండారి వామన్, కందుల రవీందర్, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

లంబాడాలకు మంత్రిపదవి ఇవ్వాలి

నార్నూర్: కాంగ్రెస్ భవిష్యత్‌లో చేపట్టే మంత్రివర్గం విస్తర్ణంలో లంబాడాలకు మంత్రిపదవి ఇవ్వాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భారత్ చౌహాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. బంజారా గోర్‌బోలి భాషను భారత రాజ్యంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం సందర్భంగా రాష్ట్ర మంత్రి జుపల్లి కృష్ణారావు తప్పుడు సమాచారం చదివారన్నారు. లంబాడాల జనాభా 25లక్షలు కాదని మొత్తం 40 లక్షలు జనాభా ఉందన్నారు. తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. లంబాడా సమాజంలో వరకట్నం తీసుకోవద్దు, ఇవ్వద్దు, హల్దీ ఫంక్షన్ చేయవద్దు, డీజేలు బంద్ చేయాలని, ఫొటో షూట్‌లు బంద్ చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. నాయకులు అడే డిగాంబర్, పరువురాం, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, విష్ణు రాథోడ్, రాథోడ్ దిలిప్‌కుమార్, దత్తరాం రాథోడ్, భిక్కు చౌహాన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



రిలేదీక్షలో కూర్చున్న కమిటీ సభ్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని మూతపడిన సిమెంట్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 11వ రోజుకు చేరాయి. శనివారం దీక్షల్లో పద్మశాలి సంఘం నాయకులు కూర్చున్నారు. వీరికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి సీసీఐ పునరుద్ధరణపై పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేయాలని సాధన కమిటీ కో కన్వీనర్ నారాయణ డిమాండ్ చేశారు. అప్పటి వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు జిల్లా కేంద్రానికి గ్రేట్ ఖలీ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ గ్రేట్ ఖలీ ఆదివారం రానున్నారు. దక్షిణ భారత్ నుంచి తన స్వస్థలానికి వెళ్తూ జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఖండేశ్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య గెస్ట్ హౌస్‌లో విడిది చేయనున్నట్లు పేర్కొన్నారు.

'8వ షెడ్యూల్ చేర్చడం హర్షణీయం'

ఉట్నూర్‌రూరల్: అసెంబ్లీలో లంబాడాల గోర్‌బోలి భాషను గుర్తించి రాజ్యంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడం హర్షణీయమని ఆల్ ఇండియా సేవా సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాథోడ్ భీంరావు శనివారం అన్నారు. రాష్ట్రమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో సైతం లంబాడా గోర్‌బోలి భాష మాట్లాడం జరుగుతుందన్నారు.

ప్రవీణ్ మరణం మిస్టరీ తేల్చాలి

ఉట్నూర్‌రూరల్: ఇటీవల అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మిస్టరీని ప్రభుత్వం తేల్చాలని ఉట్నూర్ డివిజన్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు డానియల్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్‌లు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ప్రవీణ్ మృతి క్రైస్తవ లోకానికి తీరని లోటన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎస్పీ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని మసీద్ ఈ కిబ్లాలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీబీ గార్డెన్ వెళ్లే రోడ్డు మార్గంలో జాతీయ రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సుకు వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్సు నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తుండగా.. వెనుక నుంచి టిప్పర్ ఢీ కొట్టింది. బస్సు డ్రైవర్ ఇచ్చినా ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్: తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు బండ అనిల్ కుమార్, ట్రస్ట్ కమిటీ సభ్యులు సామల రవి, మనీ, బండ మల్లికార్జున, సునీల్ కుమార్, సుమంత్, నరేశ్, రాజు, శంకర్, అరుణ్ సింగ్, కౌశిక్ రెడ్డి, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం ప్రజాసేవ కేంద్రం బేల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శనివారం జైనథ్ మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ సవాపురే విలాస్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సామ రూపేష్‌రెడ్డి, గోడే అవినాష్, దేవ్‌తాళే విఠల్, నానాజీ పటేల్ పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

బోథ్: మండల కేంద్రం నుంచి పిప్పల్‌ధరి గ్రామానికి వెళ్లే దారిలో గల డంపింగ్ యార్డులో నిప్పు అంటుకుంది. మంటల చెలరేగి పక్కనే ఉన్న మందుల భోజన్న అనే రైతు చేనులోకి మంటలు వ్యాపించాయి. జొన్నకు సంబంధించిన పశుగ్రాసానికి మంటల అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. అయితే జొన్న పంటను ఒక రోజు ముందే రైతు కంకులు తీసి పక్కనే కుప్పగా వేశాడు. పంటకు ఎలాంటి నష్టం సంభవించలేదు.

మద్యం తాగి వాహనం నడపవద్దు

బోథ్: మద్యం తాగి వాహనాలు నడపవద్దని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం బోథ్ మండలంలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానా విధించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఎస్టీ హోదా కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని హర్యానా ముఖ్యమంత్రి నాయక్ సింగ్ సైని మాలీని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, జిల్లా అధ్యక్షుడు దారట్ల విజయ్ కోరారు. శనివారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన సన్మాన సభలో పాల్గొని వినతిపత్రం అందజేశారు. మాలీలకు అన్యాయం జరిగితే ఊరుకోనని హర్యానా ముఖ్యమంత్రి అన్నారు. సామాజిక న్యాయం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బేల: మండలంలోని సాంగిడి గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను ఎస్సై, పోలీస్ సిబ్బంది పట్టుకున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి శనివారం తెలిపారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, యాజమానులతో పాటు రాయల్టీ వసూలు చేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌తో పాటు వైఎస్ చైర్మన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.